సాక్షి
హనుమకొండ
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

కాల్వలపై స్లాబ్‌లు తొలగించాలని తీర్మానం

పరకాల: దర్గాగా నాలాల ఆక్రమణ శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పరకాల మున్సిపల్ పాలకవర్గం అధికారులు స్పందించారు. భూపాలపల్లి రోడ్డులో కొందరు వ్యాపారస్తులు నాలాల ఆక్రమణ, స్లాబ్‌లు వేయడంతో పాటు మురుగు కాల్వలపై వేసిన స్లాబ్‌లన్నింటినీ తొలగించాలని నిర్ణయించారు. డ్రిల్లింగ్ వేయడం ఒక్కటే మార్గమని, అందుకు రూ.50వేలే నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: హనుమకొండ పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో సెప్టెంబర్ 27, 28 తేదీల్లో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్‌ను కలెక్టర్ ప్రావీణ్య శనివారం ఆవిష్కరించారు. 12వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకు తెలంగాణలోని సమాజం, ఆర్థిక పరిస్థితులు, సాంస్కృతిక అంశాలపై ఈసదస్సును నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రమౌళి, కన్వీనర్ శ్రీనివాస్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సురేశ్‌బాబు అధ్యాపకులు పాల్గొన్నారు.

రోబోటెక్స్‌పై కార్యశాల



విద్యారణ్యపురి: సోహం రోబోటిక్స్ హైదరాబాద్ అకాడమీ, కేడీసీ సంయుక్తంగా ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం కాలేజీలో రోబోటిక్స్‌పై కార్యశాల నిర్వహించారు. 21 రోబోటిక్స్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి మాట్లాడుతూ రోబోటిక్స్‌పై శిక్షణ పొందిన వారు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో సోహం రోబోటిక్స్ అకాడమీ సహ వ్యవస్థాపకులు బోరవెల్లి జశ్వంత్, కళాశాల ఫిజిక్స్‌విభాగం అధిపతి, వర్క్‌షాప్ కన్వీనర్ కె.రజనీలత, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆచార్య జ్యోతికి జానపద సాహిత్య పురస్కారం



హన్మకొండ కల్చరల్: జానపద సాహిత్య పురస్కారానికి కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం విశ్రాంతాచార్యులు పాకనాటి జ్యోతి ఎంపికయ్యారు. ఈమేరకు సెప్టెంబర్ 2న సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న హైదరాబాద్ జానపద సాహిత్య పరిషత్ వార్షికోత్సవ వేడుకలో జ్యోతికి పురస్కారం అందించనున్నట్లు పరిషత్ అధ్యక్షురాలు డాక్టర్ సి. వసుంధరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీకి చెందిన జ్యోతి జానపద సాహిత్యంలో అనేక రచనలు చేశారు. వ్యాసాలు రాశారు. విశ్వవిద్యాలయ స్థాయిలో జానపద సాహిత్యాన్ని నాలుగు తరాలకుపైగా బోధించి, జానపద విజ్ఞానాన్ని విస్తృతపర్చారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థులచే జానపద సాహిత్యంలోని పురాణాలు, జానపద కళారూపాలు, జానపద ఆటలు, జానపద గేయాలు తదితర అంశాలపై పరిశోధనలు చేయించారు. జానపద సాహిత్యంపై ఆచార్య జ్యోతి చేస్తున్న కృషికి జానపద సాహిత్య పురస్కారం లభించడం అభినందనీయమని కాకతీయ విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ అర్బన్: రానున్న రెండు, మూడ్రోజుల్లో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో.. సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా, మండల అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా..

- నిధులు ఖర్చు చేయండి.. అదనంగా తీసుకొస్తా
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 12 అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పరకాల పట్టణాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. పరకాల మున్సిపాలిటీలో మూలుగుతున్న నిధులను తక్షణమే అభివృద్ధి పనులకు కేటాయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పరకాల మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రధానంగా.. 7 సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు రీ ఎస్టిమేట్ రీ టెక్నికల్ సాంక్షన్, రీ టెండర్ పిలవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మరో 12 అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం ఆయన పరకాల మున్సిపాలిటీకి కేటాయించిన నిధులు, ఆయా నిధుల ఖర్చులపై మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. బీపీఎస్–ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధిత రూ.47లక్షలతో పాటు స్వచ్ఛభారత్ నిధులు, ఎస్‌డీఎఫ్ నిధులు, 14, 15వ ఆర్థిక సంవత్సరానికి సంబంధిత కోట్లాది రుపాయల నిధులు నిల్వ ఉన్నాయని.. వాటన్నింటినీ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ద్వారా అభివృద్ధి పనులకు కేటాయించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణాభివృద్ధికి రావాల్సిన నిధులపై నివేదిక సిద్ధం చేయాలని ఆయన కోరారు. పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ కోసం నూతన వాహనాల కొనుగోలు, అండర్ గ్రౌండ్ పైప్‌లైన్, రోడ్లు, డ్రెయినేజీ, వైకుంఠ రథం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న నిధులకు అదనపు నిధులతో పాటు ప్రస్తుతం ఉన్న నిధులు ఖర్చుచేయడానికి శాఖాపరంగా ఏమైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు తనవంతుగా సహాయం అందిస్తానని స్పష్టం చేశారు. పట్టణాభివృద్ధికి యాక్షన్ ప్లాన్‌తో ప్రజల సహకారంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సమావేశంలో పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ విజయపాల్ రెడ్డి, కమిషనర్ కె.నర్సింహ, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులతో పాటు మున్సిపల్ అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భీంపల్లిలో ఎలాంటి ఆంక్షలూ లేవు

- సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు అవాస్తవం
- అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్



గ్రామస్తులకు ఆర్‌డీటీ టెస్టులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపూర్: భీంపల్లిలో జ్వరాల కారణంగా కరోనా సమయంలో మాదిరి లాక్‌డౌన్ విధించారని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు అవాస్తవమని, ప్రజలు వాటిని నమ్మవద్దని, గ్రామంలో ఎలాంటి ఆంక్షలు లేవని అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్ తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లిలో గ్రామస్తులను అంతుచిక్కని వ్యాధి వెంటాడుతోందని, గ్రామంలో రెడ్ అలర్ట్ ప్రకటించారని, విష జ్వరాల కారణంగా గ్రామ కట్టడి చేశారని, కరోనా సమయంలో అవలంబించిన లాక్ డౌన్ విధించారని, ఇతర ప్రాంతాల నుంచి గ్రామంలోకి ఎవరూ రావొద్దని, గ్రామం నుంచి ఎవరూ బయటకు వెళ్లొద్దంటూ శనివారం సోషల్ మీడియాలో వదంతులు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్ గ్రామంలో పర్యటించారు. ఇంటింటా జ్వర సర్వే, ఆర్‌డీటీ టెస్టులు నిర్వహించి దోమల నివారణకు టీమోఫాస్ స్ప్రే చేశారు. అనంతరం మదన్‌మోహన్ మాట్లాడుతూ.. భీంపల్లిలో సుమారు 2 నెలల క్రితం గ్రామస్తులు జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడ్డారని, ఆసమయంలో వైద్యసిబ్బంది ఇంటింటి జ్వర సర్వే, లార్వా సర్వే చేపట్టి వైద్యశిబిరాలు నిర్వహించారన్నారు. అవసరమైన వారిని ఉప్పల్ పీహెచ్‌సీకి, కమలాపూర్ సీహెచ్‌సీకి రెఫర్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జ్వరాలు అదుపులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ రేణుక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కమలాపూర్: హనుమకొండలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి నాలుగు గోల్డ్, ఐదు సిల్వర్, రెండు బ్రౌంజ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.కవితారెడ్డి శనివారం తెలిపారు. అండర్–18 విభాగం డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో ఎస్.సాయిరాం, జావెలిన్ త్రోలో ఎం.రాహుల్, 200 మీటర్ల పరుగు పందెంలో జి.శివప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో జి.శివప్రసాద్, షాట్‌పుట్‌లో ఎ.శ్రీరాం, జావెలిన్ త్రోలో ఎ.రాంచరణ్, 1,500 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్.సన్ని, అండర్–20 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో కె.రాజు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించారు. అండర్–18 విభాగం షాట్‌పుట్‌లో ఎం.రాహుల్, 1,500 మీటర్ల పరుగు పందెంలో బి.సుజన్‌కాంత్ తృతీయ స్థానంలో నిలిచి బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ సంతోశ్, అధ్యాపకులు అభినందించారు.

'భూదందాలు.. సెటిల్‌మెంట్ల'పై సీపీ సీరియస్

- 'నయీం' తరహా దందాలపై విచారణకు ఆదేశం
- రంగంలోకి దిగిన స్పెషల్‌బ్రాంచ్, ఇంటెలిజెన్స్ వర్గాలు
- ఆక్రమణకు గురైన భూముల వివరాలు సేకరిస్తున్న నిఘా వర్గాలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా 'సాక్షి' కథనం.. 'ఎక్స్' వేదికగా డీజీపీ, సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు

సాక్షిప్రతినిధి, వరంగల్ :



Fasi Adeeb
@fasi_adeeb

వరంగల్లో మళ్ళీ మొదలైన భూ ఆక్రమణలు సెటిల్మెంట్ లు...

దీనిపై తెలంగాణ రాష్ట్ర డీజీపీ మరియు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి @revanth_anumula దృష్టి సాధించాలని కబ్జాదారులపై కఠినంగా వ్యవహరించే విధంగా వరంగల్ సీపీ కు ఆదేశాలు జారీ చేయాలని వరంగల్ ప్రజల విజ్ఞప్తి....

సాక్షి

భూదందాలు.. సెటిల్మెంట్లు

సాక్షి క్లిప్పింగ్.. ఎక్స్ వేదికగా డీజీపీకి ఫిర్యాదు

'భూదందాలు, సెటిల్‌మెంట్ల' బాగోతంపై పోలీసుశాఖలో కదలిక వచ్చింది. వారి ఆట కట్టించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధి గ్రేటర్ వరంగల్‌లో ఇటీవల జరిగిన భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లపై 'భూ దందాలు.. సెటిల్‌మెంట్లు... వరంగల్ నగరంలో మళ్లీ 'నయీం' తరహా దందాలు' శీర్షికతో గత నెల 30న వెలువడిన కథనం సంచలనం సృష్టించింది. వార్త క్లిప్పింగ్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం.. 'ఎక్స్' వేదికగా డీజీపీ, సీఎం, సీఎంఓల వరకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇదే సమయంలో భూకబ్జాదారులు, నేరస్తులపై కఠినంగా వ్యవహరిస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సైతం విచారణకు ఆదేశించారు. ఈనేపథ్యంలో రంగంలోకి దిగిన స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతుండగా.... కబ్జాలకు పాల్పడింది ఎవరు? కబ్జాదారుల వెనుక ఉన్నదెవరు? అన్న కోణంలో ఆరా తీస్తుండడం కలకలం రేపుతోంది.

ఆక్రమణలు ఎక్కడెక్కడ?

భూముల ఆక్రమణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిఘావర్గాలు సీరియస్‌గా ఆరా తీస్తున్నాయి. ఎన్‌ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), హనుమకొండ గోపాల్‌పూర్ రోడ్డులో కొందరు భూములు కబ్జా చేసిన ఫిర్యాదులపై శనివారం నిఘా వర్గాలు ఆరా తీసినట్లు తెలిసింది. అదే విధంగా లష్కర్ సింగారంలో ఓ ప్రముఖ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో రెండు వేల నుంచి 2,500 గజాల వరకు స్థలాన్ని కొందరు కబ్జా చేయగా.. ఆ వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరిన విషయమై కూడా ఇరువర్గాల అభిప్రాయాలు సేకరించినట్లు సమాచారం. కేయూసీ పరిధి గుండ్ల సింగారంతోపాటు చింతగట్టు, ఎర్రగట్టు ప్రాంతాల్లోనూ భూములు కబ్జాకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై నిఘా వర్గాలు పలువురిని కలిసి ఆరా తీయడంపై నగరంలో చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో బాధితులు సైతం ఒక్కొక్కరుగా ఫిర్యాదు చేసేందుకు బయటకు వస్తున్నారు.

ఒక్కసారిగా మళ్లీ తెరమీదకు..

రెండేళ్ల కిందట 'నయీమ్ గ్యాంగ్' తరహాలో కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి భూ ఆక్రమణలకు పాల్పడడం నగరంలోని సామాన్యులను అభద్రతకు గురి చేసింది. దీంతో పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించి కబ్జాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించింది. 14 మందిని అరెస్ట్ చేశారు. అంతేకాకుండా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోనూ కబ్జాలకు పాల్పడిన వివిధ వర్గాలకు చెందిన సుమారు 22 మందిని వేర్వేరు కేసుల్లో రిమాండ్‌కు పంపారు. కొందరిపై పీడీ యాక్టు పెట్టడం, తదితర చర్యల వల్ల చాలాకాలం కబ్జాలు, సెటిల్‌మెంట్లు తగ్గాయి. ఇటీవల మళ్లీ భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, భూయజమానులకు బెదిరింపులు పెరగడం నగరంలో హాట్‌టాపిక్ అయ్యింది. సాక్షి కథనం నేపథ్యంలో ఈ దందాలపై పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.. ఓ వైపు నిఘావర్గాలు, మరోవైపు నగరంలోని పలు ఠాణాలకు చెందిన స్టేషన్ హౌస్ ఆఫీసర్లను అలర్ట్ చేశారు. వారు ఎక్కడికక్కడ భూదందాలు, సెటిల్‌మెంట్ల వ్యవహారంపై ఆరా తీస్తుండడం చర్చనీయాంశమైంది.



ఇల్లాలి చేతిలో ఇంటి ఆరోగ్యం

ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలంటారు. అలాంటి ఇల్లాలు అప్రమత్తంగా ఉంటేనే ఆ ఇల్లు.. కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండేది. అనారోగ్యం బారిన పడేస్తున్న వాటిలో 55 శాతం కాలుష్యం వాతావరణంలోనిదైతే.. ఇంట్లో వెలువడే కారకాలు 45 శాతం అని వైద్యులు పేర్కొంటున్నారు. అధిక సమయం ఇంట్లో గడిపే మహిళలు వీలైనంత వరకు ఇంటిని పరిశుభ్రంగా ఉంచడంపై దృష్టి పెట్టాలి. సెలవు రోజుల్లో మగవారు ఇంటికి కాస్త సమయం కేటాయిస్తే ఆ ఇల్లు ఆరోగ్యవంతంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్వచ్ఛదనం..పచ్చదనం పేరుతో ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. మన ఇంటి ఆరోగ్యంపై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.

ఖిలా వరంగల్

వంట గదిలో జాగ్రత్తలు తప్పనిసరి

- శుభ్రతపై పిల్లలకు అవగాహన అవసరం
- ఇంట్లోని కాలుష్య కారకాలపై దృష్టి పెట్టాలి
- స్వచ్ఛదనం–పచ్చదనంపై కళాబృందాలతో ప్రజలకు చైతన్యం
- ఇంటి ఆరోగ్యంపై 'సాక్షి' సండే స్పెషల్



సండే స్పెషల్

గాలి, వెలుతురు ధారాళంగా రావాలి..



గాలి, వెలుతురు ఇంట్లోకి ప్రవేశించేలా చూడాలి. కుటుంబ సభ్యులు పరిశుభ్రత పాటించేలా చూడాలి. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మంది సభ్యులున్న కుటుంబాల్లో వ్యాధులు సులభంగా వ్యాపిస్తాయి. వంట గదిలో వెలువడే వాయువులు చిమ్నీల ద్వారా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

బొద్దింకలతో జాగ్రత్త



వంటగదిలో తిరిగే బొద్దింకల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు వాటి నివారణ చర్యలు చేపట్టాలి. వీటి కారణంగా.. శ్వాసకోశ సంబంధిత, ఎలర్జీ, ఆస్తమా, టైఫాయిడ్ వంటి రోగాలు వస్తాయి. వీటి నివారణకు సత్వరమే చర్యలు చేపట్టాలి.

చేతులు శుభ్రమేనా?

చాలా మంది పిల్లలు ఆకలేయగానే చేతులు కడుక్కోకుండానే అన్నం తినేందుకు ఉపక్రమిస్తారు. అలాకాకుండా చేతుల శుభ్రత గురించి తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలి. ఆహారం తీసుకొనే ముందు మల, మూత్ర విసర్జనల అనంతరం విధిగా చేతులు శుభ్రం చేసుకునేలా అలవాటు చేయాలి.

హానిచేసే రసాయనాలు



ఇంట్లో వాడే రూం ఫ్రెషనర్లు, సబ్బులు, క్రీములు, క్లీనర్లు, కాస్మోటిక్స్ కారణంగా వెలువడే రసాయనాలు జీర్ణ వ్యవస్థ, సంతానోత్పత్తి, వ్యాధి నిరోధక శక్తి తదితరాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా పిల్లలు, గర్భిణులు వీటి ప్రభావానికి గురవుతారని పేర్కొంటున్నారు. గృహిణులు వీటి విషయంలో జాగ్రత్త వహించకపోతే కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది.

సగం వ్యాధులు బట్టలతోనే..

చాలా ఇళ్లలో బెడ్‌షీట్లు, పిల్లో కవర్లు, టవళ్లు నెలల తరబడి అలాగే ఉంచుతారు. వీటిని తరచూ ఉతక్కపోతే స్టేఫిలోకోకస్, పెప్టోకోకస్ అనే బాక్టీరియా వృద్ధి చెంది ఒకరి నుంచి మరొకరికి చర్మ సంబంధిత వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా భోజనం చేసే ప్లేట్లు సైతం శుభ్రంగా ఉంచుకోవాలని, తినేముందు చేతులు శుభ్రం చేసుకోవాలంటున్నారు. ఎవరి సబ్బు వాళ్లే వాడాలని వీటి ద్వారా కూడా చర్మ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువ ఉందని వైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. ఇంటి వాతావరణం, ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం, చెత్తాచెదారం, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఇంటి పరిసరాల్లో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతాయి. మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నివారించవచ్చు.

– సృజన, వైద్యురాలు, వరంగల్

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం



ఇంట్లో నేను, నా భర్త, ఇద్దరు పిల్లలు ఉంటాం. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్త పడుతున్నాం. ఇంటిని, వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకుంటున్నాం. ఇంటి సరిసరాల్లో మురుగు నీరు లేకుండా చూస్తున్నా.

– బొలుగొడ్డు రంజిత, తూర్పుకోట

మొక్కలతో కాలుష్య నివారణ



ఇంట్లో కలబంద వంటి ఔషధ మొక్కల్ని పెంచుకోవడం ద్వారా వాయు కాలుష్యాన్ని కొంత మేరకు నివారించుకోవచ్చు. దీంతో పాటు ఇంటి ఎదుట ఆవుపేడతో కల్లాపి చల్లడం వల్ల మనం నడిచి వచ్చే సమయంలో మనతో పాటు ఇంట్లోకి చొరబడే కొన్ని రకాల బాక్టీరియాలను నివారించవచ్చు. ఇంటి ఆవరణలో వేప, తులసి వంటి ఔషధ గుణాలు కలిగిన మొక్కల్ని పెంచడం వల్ల ఇంటి వాతావరణం ఆరోగ్యకరంగా ఉంటుంది. ఇంటి ఇల్లాలు ఎంత అప్రమత్తంగా ఉంటే ఇంట్లో వాతావరణం అంత ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇంట్లో వాతావరణం ఎంత ఆహ్లాదకరంగా ఉంటే వ్యాధులకు అంత దూరంగా ఉండొచ్చు.



ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్వచ్ఛదనం–పచ్చదనంపై ఇప్పటికే అధికారులు అవగాహన సదస్సులు చేపడుతున్నారు. డ్రైడే సందర్భంగా వారంలో ఒకరోజు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు సైతం క్షేత్ర స్థాయిలో తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. నిల్వ నీటిని తొలగించేలా, దోమలు వృద్ధి చెందకుండా చూస్తున్నారు. ఆర్పీలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ మహిళలను భాగస్వాములను చేస్తున్నారు. కళాబృందాలతో ఆటపాటల రూపంలో చైతన్యం చేస్తున్నారు.

ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు..

-8లో▸

- త్వరలో వరంగల్ కార్పొరేషన్‌ను గెలుచుకుంటాం
- కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ప్రదోష వేళ నందీశ్వర అభిషేకం



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ మాసం శని త్రయోదశిని పురస్కరించుకుని ప్రదోష వేళ తొలిసారి నందీశ్వర అభిషేకాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. సాయంకాలం సూర్యాస్తమయం ప్రదోష కాలంలో కోమాండ్లపల్లి సంపత్‌కుమార్ ఆచార్యత్వాన మల్లికార్జునస్వామి గర్భాలయానికి ఎదురుగా ఉన్న నందీశ్వరుడికి అభిషేకం ప్రారంభించారు. ముందుగా విఘ్నాలు కలగకుండా విఘ్నేశ్వర పూజ చేసి స్వస్తి పుణ్యాహవచనం జరిపించారు. రుద్రాధ్యయంలోని రుద్ర మంత్రాలతో విశేషంగా పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో నందీశ్వరుడిని అభిషేకించారు. నందీశ్వరుడికి వస్త్రధారణ చేసి వేదోక్తంగా పూజించి పండ్లు ఫలాలతో నైవేద్యం సమర్పించారు. శనిగల ప్రసాదం, వడమాలతో అలంకరించారు. అనంతరం ఏక కాలంలో నందీశ్వరుడికి, రుద్రుడికి నక్షత్ర హారతి సమర్పణ కార్యక్రమం కన్నుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ మార్నేని మధుమతి, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, మునిగాల సంపత్, పుల్యాల జ్యోతి, అద్దగూడి సతీశ్‌కుమార్ అర్చకులు పాతర్లపాటి రవీందర్, మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ పాల్గొన్నారు.

కేయూలో భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్షన్ కమిటీ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని భూములు ఆక్రమణకు గురయ్యాయని గతంలో ఫిర్యాదు అందిన నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ అధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్, రెవెన్యూ, మున్సిపాలిటీ, టౌన్ ప్లానింగ్, కాకతీయ యూనివర్సిటీ బిల్డింగ్ డివిజన్ అధికారులతో కూడిన ఇన్‌స్పెక్షన్ కమిటీ శనివారం కేయూలోని పలు చోట్ల భూములను పరిశీలించింది. కాకతీయ యూనివర్సిటీలోని కుమార్‌పల్లి ఏరియాలో 214, 229 సర్వే నంబర్లలో, పిలివేల్పుల ఏరియాలో 413 సర్వే నంబర్‌లో, లష్కర్‌సింగారంలోని 32 సర్వే నంబర్‌లోని భూములను ఇన్‌స్పెక్షన్ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా ఎక్కడెక్కడ భూములు ఆక్రమణకు గురయ్యాయి అనే విషయం కూడా కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారులు సంబంధిత విజిలెన్స్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. కేయూ బిల్డింగ్ డివిజనల్ అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవరెడ్డి, ఇంజనీర్ రామయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీపీఎం హనుమకొండ జిల్లా కమి టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, సాంకేతిక పేరుతో కాలయాపన చేయకుండా, ప్రతీ రైతును రుణ విముక్తుడిని చేయాలన్నారు. మాఫీ అయిన రైతులకు వెంటనే రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌లతో సెప్టెంబర్ 3న హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సారంపల్లి వాసుదేవ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, నాయకులు జి.ప్రభాకర్ రెడ్డి, ఎం.చుక్కయ్య, గొడుగు వెంకట్, జి.రాములు, డి.తిరుపతి, కె.లింగయ్య, దీప, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి


మహేశ్(ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని నార్లాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్ట రమేశ్, స్వరూప దంపతుల కుమారుడు మహేశ్(17) పశువులను మేపడానికి అడవికి వెళ్లాడు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మహేశ్ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం



- కాజీపేట శ్వేతార్కమూలగణపతి దీక్షకు పెరుగుతున్న మక్కువ
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చి మాలలు ధరిస్తున్న భక్తులు

ఆధ్యాత్మికం.. మానవుడిని ఆరోగ్యంగా ఉంచే దివ్య ఔషధం. మానసిక ప్రశాంతత, సేవాభావం, దాన గుణం అలవాటు చేసే మంత్రం దైవ చింతన సొంతం. నేడు వేగవంతమైన జీవనం.. మారుతున్న జీవనశైలితోపాటు పలు రుగ్మతలకు గురవుతున్న మానవుడు.. పలు దేవతా మూర్తుల మాలధారణ, దీక్షలతో తనదైనందిన జీవన విధానాన్ని మార్చుకుంటున్నాడు. దీక్షల సందర్భంగా కఠిన నిబంధనలు మానవుడి జీవన శైలిలో ఎన్నో మార్పులు తీసుకొస్తున్నాయి. ఇందులో ప్రధానం ఆరోగ్యం. సమయానుకూలంగా భోజనం చేయడం, నిద్రించడం, శరీర శుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తెలంగాణలోనే ఏకైక ఆలయంగా వెలుగొందుతున్న శ్రీస్వయంభు శ్వేతార్కమూలగణపతి మాలధారణ దీక్షలు శనివారం (ఆగస్టు 31వ తేదీ) ప్రారంభమైన నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

దీక్షలతో మానవుడి జీవన శైలిలో మార్పు

కాజీపేట : గతంలో గొప్ప వైద్యం లేదు. కార్పొరేట్ ఆస్పత్రులు లేవు..అయినా ప్రజలు ఆరోగ్యంగా ఉండేవారు. అప్పట్లో మునులు ఆధ్యాత్మిక చింతనలో ఉంటూ..మితంగా ఆహారం తీసుకోవడం, తెల్లవారుజామునే లేవడం, సూర్య నమస్కారాలు చేయడం వంటి దైనందిన కార్యక్రమాల ద్వారా నిత్యం నూతనోత్తేజులుగా కనిపించేవారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు దరిచేరేవి కావు. ప్రస్తుతం వేగవంతమైన జీవితంలో ప్రజలు పలు రుగ్మతలకు గురవుతున్నారు. ప్రశాంతతకు దూరమై అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక చింతనతో మేలు కలుగుతోందని గ్రహిస్తున్న పలువురు పలు రకాల మాలలు ధరిస్తున్నారు.


ఆలయంలో మాలలు ధరిస్తున్న భక్తులు

గణపతి దీక్షల సమయం ఇలా..

రాష్ట్రంలోనే అరుదైన దివ్య క్షేత్రంగా పిలువబడుతున్న స్వయంభు శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో మండల, అర్ధమండల, 16 రోజుల షోడష దీక్షలు, నవరాత్రి దీక్షలను భక్తులు స్వీకరిస్తారు. 28 ఏళ్లుగా దేవాలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుల ఆధ్వర్యంలో గణపతి దీక్షలు సాగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని భక్తులు కాజీపేటకు వచ్చి దీక్షలు స్వీకరిస్తున్నారు. దీక్షలో ఉన్న మాలధారులకు ఆలయంలోనే ఉదయం, సాయంత్రం వేళల్లో పూజలు, అల్పాహారం, బిక్షా, వసతి సౌకర్యాలు ఉచితంగా దాతల సాయంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

దీక్ష నియమాలు..

- మాలధారులు(దీక్షలు స్వీకరించిన భక్తులు) తెల్లవారుజామునే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని చన్నీటితో స్నానం చేయాలి. ఉదయం ప్రాతఃకాలం పూజలు చేయాలి.
- గణపతి చిత్రపటం ఇంట్లో లేదా దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసి నిత్యం రెండు పూటల పూజలు చేయాలి.
- సాయంత్రం వేళల్లో పూజలు ముగిసిన అనంతరం సహా మాలధారులతో కలిసి భజనలు చేయాలి.
- మాలలు ధరించిన భక్తులు తెలుపు వస్త్రాలు ధరించాలి.
- దీక్షలో ఉన్నంత కాలం చెప్పులు ధరించొద్దు.
- నేలపై నిద్రించాలి.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వినాయక ఆలయాల్లో ఎక్కడైనా దీక్షలు విరమించొచ్చు.

శాస్త్రీయంగా కలిగే ప్రయోజనాలు..

దీక్షలు స్వీకరించడం వల్ల ఆధ్యాత్మికంగానేగాక శాస్త్రీయంగా ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. మండల దీక్షలను కఠినంగా ఆచరించిన భక్తుల్లో చెడు కోరికలు తొలగి పోయి చక్కటి జీవన విధానం అలవాటు అవుతుంది.

- పాదరక్షలు లేకుండా నడవడం వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరిగి రక్తపోటు, గుండె జబ్బులు దూరమవుతాయి.
- నేలపై నిద్రించడం వల్ల కామం పోతుంది. శారీరక రుగ్మతలు, ఒళ్లు నొప్పులు తగ్గడానికి అవకాశం ఉంటుంది.
- ఒకే పూట భోజనం చేయడం వల్ల జీర్ణకోశ వ్యాధులు నయమవుతాయి. మాలధారులు చురుగ్గా ఉంటారు.
- నిత్యం దైవ చింతనలో గడపడం వల్ల మానవుడిలో ఉండే గర్వం, పొగరు, దురుసు ప్రవర్తనలు తొలగిపోతాయి.
- భక్తులకు, కుటుంబ సభ్యులకు సేవలు చేయడం ద్వారా నేను అనే అహం, స్వార్థం తగ్గుతుంది.
- చన్నీటి స్నానాలు చేసి దైవ ప్రార్థనలు పూర్తి చేసి సూర్యనమస్కారాలు చేయడం వల్ల యోగా చేసిన ఫలితంతోపాటు కోర్కెలు అదుపులో ఉంచుతుంది.
- నిత్యం దీక్షలో ఉన్న లేకపోయినా ఓం గం గణపతయే నమః అంటూ మనసులో పఠించడం వల్ల కష్టాలు తీరుతాయని భక్తుల విశ్వాసం

మాల ధరించడం ఎన్నో జన్మల పుణ్యఫలం



గణపతి మాలధరించడం పూర్వజన్మ సుకృతంగా చెప్పొచ్చు. స్వయంభు శ్వేతార్కుడిగా కొలువుదీరిన కాజీపేటలో గణపతి మాలలకు ప్రాధాన్యం ఉంది. దీక్షలతో మాలధారుడిలో కోరికలు నశించి భక్తిమార్గంలో పయనించడానికి ఉపయోగపడుతుంది.

-అయినవోలు రాధాకృష్ణ శర్మ, దేవాలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు

వ్యసనాలకు దూరం



దీక్ష చేపట్టిన మాలధారుడిలో మంచి మార్పులు వస్తాయి. ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలుంటాయి. చేదు స్నేహాలు, అలవాట్లకు దూరమై భక్తిచింతనలో గడుపుతాం. నేను 22 ఏళ్లుగా గణపతి మాల ధరిస్తున్న. శ్వేతార్క ఆలయంలో మాల ధరించి భక్తులకు సేవ చేయడం వల్ల ఆనందం కలుగుతోంది.

-దేవులపల్లి సదానందం, గురుస్వామి

ఆన్‌లైన్‌లోనే ఎక్స్‌పోర్ట్ పర్మిట్ల జారీ

- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జి.లక్ష్మీబాయి


మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మీబాయి

వరంగల్: రానున్న సీజన్ నుంచి ఎక్స్‌పోర్ట్ పర్మిట్లు ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తామని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ జి.లక్ష్మీబాయి అన్నారు. శనివారం వరంగల్ మార్కెట్ కార్యాలయంలోని పర్సన్ ఇన్‌చార్జ్ చాంబర్‌లో రాష్ట్ర అదనపు సంచాలకుడు రవికుమార్‌తో కలిసి వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీతోపాటు ఖరీదుదారులతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జి.లక్ష్మీబాయి మాట్లాడుతూ ఖరీదారులు కొనుగోలు చేసిన వివరాలను ప్రతినెల 10వ తేదీ లోపు పర్చేజ్ రిటర్న్‌లను మార్కెట్ కార్యాలయంలో కచ్చితంగా సమర్పించాలన్నారు. అలాగే, వరంగల్ మార్కెట్‌లో రైతులకు వసతులను కల్పించాలని మార్కెట్ కార్యదర్శిని ఆదేశిస్తూ అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం లక్ష్మీపురం కూరగాయలు, పండ్ల మార్కెట్లను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్, అన్ని సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు, జేడీఎం వి.శ్రీనివాస్, డీడీఎం వి.పద్మావతి, డీఎంఓ కె.సురేఖ, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, ఖమ్మం, జమ్మికుంట, మహబూబాబాద్, జనగామ మార్కెట్ కార్యదర్శులు, మార్కెట్ ఉద్యోగుల సంఘం నాయకులు జె.భాస్కర్, పీ.అశోక్, లాషరీఫ్, జీవన్, గ్రేడ్-2 కార్యదర్శులు ఎస్.రాము, అంజిత్‌రావు, సుకన్య, రాజేందర్, చాంబర్ ప్రతినిధులు అల్లే సంపత్, చింతలపల్లి వీరారావు, ఎన్‌రెడ్డి లింగారెడ్డి, ఇతర మార్కెట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో 'ఇంటర్‌సిటీ' దారి మళ్లింపు


కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని ఎర్రుపాలెం-కొండపల్లి గ్రామాల మధ్య వర్షాల కారణంగా వరద నీరు రైలు పట్టాల సమీపానికి చేరడంతో వరంగల్, కాజీపేట జంక్షన్ మీదుగా వెళ్లాల్సిన గుంటూరు-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను వయా నడికుడ, నల్లగొండ మీదుగా దారి మళ్లించి నడిపించినట్లు రైల్వే అధికారులు శనివారం రాత్రి తెలిపారు.

కాజీపేట జంక్షన్‌కు ఆలస్యంగా చేరుకున్న పలు రైళ్లు

వర్షాల కారణంగా నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు, హైదరాబాద్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ అరగంట, హైదరాబాద్-తాంబరం ఎక్స్‌ప్రెస్ అరగంట, మహబూబ్‌నగర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ అరగంట ఆలస్యంతో కాజీపేట జంక్షన్‌కు చేరుకుని వెళ్లినట్లు అధికారులు తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్ హెల్ప్ డెస్క్ నంబర్ 2778 2660, వరంగల్ రైల్వే స్టేషన్ హెల్ప్ డెస్క్ నంబర్ 27782751లో రైళ్ల వివరాల కోసం సంప్రదించాలని రైల్వే కమర్షియల్ అధికారులు కోరారు. కాగా, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మళ్లింపు, రైళ్ల ఆలస్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సొరంగ మార్గం నుంచి గూడ్స్ ట్రైన్

- ట్రయల్ రన్ చేసిన అధికారులు

కాజీపేట -హసన్‌పర్తి మధ్య నిర్మించిన సొరంగ మార్గం నుంచి శనివారం గూడ్స్ ట్రైన్‌తో రైల్వే అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. వడ్డేపల్లి చెరువు దాటిన తర్వాత 200 మీటర్ల మేర రైలు అండర్ రైలు (సొరంగమార్గం) మార్గం నిర్మించారు. ట్రాక్ ఫిట్‌నెస్ తనిఖీ చేసేందుకు ట్రయల్ రన్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అన్ని విధాలా ట్రాక్ ఫిట్ అయిన తర్వాత దక్షిణ మధ్య రైల్వే అధికారులతో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

కేసీఆర్ ప్రశ్నించినందుకే 'దేవాదుల'కు పునాదులు!

- ఈ ప్రాజెక్టు నుంచి ఎక్కువ కమీషన్ ముట్టింది కడియం శ్రీహరికే
- కేసీఆర్ కాదు.. అతి పెద్ద డెకాయిట్ ఉత్తమ్‌కుమార్ రెడ్డే...
- ప్రెస్‌మీట్‌లో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేల ఫైర్


మాట్లాడుతున్న ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం

సాక్షిప్రతినిధి, వరంగల్ : సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని కేసీఆర్ ప్రశ్నించినందుకే దేవాదుల ప్రాజెక్టుకు పునాదులు పడ్డాయని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కడియం శ్రీహరి భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేవాదుల ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని, ఆ ప్రాజెక్టు పనుల్లో అతిపెద్ద కమీషన్‌దారు ఆయనేనని ఎవరిని అడిగినా చెబుతారన్నారు. శనివారం బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్య, నన్నపనేని నరేందర్ తదితరులతో కలిసి వినయ్‌భాస్కర్ మాట్లాడారు. టీడీపీలో చంద్రబాబుతో, బీఆర్ఎస్‌లో కేసీఆర్‌తో, ఇప్పుడు కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డితో కడియం శ్రీహరి ఉన్నాడని, ఏ పార్టీ అధికారంలో అంటే ఆ పార్టీలో ఉంటూ... ఏ రోటి కాడి పాట ఆ రోటి కాడ పాడుతున్నాడని ఆరోపించారు. హైడ్రా అనేది ఒక డ్రామా అని..రెండు, మూడు నెలల కొకసారి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేక రేవంత్ సర్కారు ప్రజల దృష్టిని మరల్చుతోందని పేర్కొన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ టి.రాజయ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి వ్యక్తిగత స్వార్థం కోసం స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలను తాకట్టు పెట్టాడని ఆరోపించారు. ఆయనకు సిగ్గు, శరం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇరిగేషన్ గురించి చేసిన ప్రస్తావనలో కేసీఆర్‌ను డెకాయిట్‌గా సంబోధించడాన్ని ఖండించారు. రెండు శాఖలకు మంత్రిగా ఉంటూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి అతి పెద్ద డెకాయిట్ అని, ఆయన జైలుకు పోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు రుణ విమోజన కమిటీ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు జనార్దన్ గౌడ్, పులి రజనీకాంత్, బండి రజనీ కుమార్, నయీం, జోరిక రమేశ్, శ్రవణ్ కుమార్, పోలేపల్లి రామ్మూర్తి, ఖలీల్, సదాంత్, రవీందర్ రావు, వీరస్వామి పాల్గొన్నారు.

దర్గా ఉత్సవాలు హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక

- దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా
- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం 2న స్పీకర్ గడ్డం ప్రసాద్, ఇతర మంత్రులు రాక


మాట్లాడుతున్న దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా

కాజీపేట రూరల్: జిల్లాలో చారిత్రక కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉర్సు ఉత్సవాలు హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకని దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా అన్నారు. కాజీపేట దర్గాలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ దర్గా ఉత్సవాలకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్, పోలీస్ కమిషనర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్, ఇతర జిల్లా అధికారుల సహకారంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కోవిడ్‌తో రెండు సంవత్సరాలు దర్గా ఉత్సవాలు సరిగా జరగలేదని, ఈ సారి గతం కంటే రెట్టింపుగా ఉత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఒకేసారి 7,500 మందికి భోజనం తయారు చేసే భారీ వంట పాత్రను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి గంధం ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతాయని, సోమవారం రాత్రి జరిగే హిందూ, ముస్లిం పీస్ సెమినార్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో హిందూ, ముస్లింలు ఐక్యతతో ఉంటున్నారన్నారు. మాజీ కార్పొరేటర్ అబుబక్కర్ మాట్లాడుతూ దర్గా ఉత్సవాల్లో గంధం, ఉర్సు, బధావా ఉత్సవాలు ప్రధాన ఘట్టమన్నారు. దర్గా పీఠాధిపతి భక్తియార్‌బియాబానీ మాట్లాడుతూ దర్గా ఉత్సవాల్లో 300 ఏళ్ల చరిత్ర గల సందల్ (గంధం) పండుగ ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో మన్సూర్ బియాబానీ, ముస్తాఫాబియాబానీ, అజీజ్‌బేగ్ పాల్గొన్నారు.

ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్


మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

నయీంనగర్: ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని, ప్రతి ఇంటికీ వెళ్లి సభ్యత్వం ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు.శనివారం హనుమకొండ 'డి' కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో కూడా రామరాజ్యం రావాలంటే సభ్యత్వ నమోదు పెంచాలన్నారు. ప్రపంచంలో ఏ పార్టీకి 18 కోట్ల సభ్యత్వం లేదని, ఈసారి ఇంకో పది కోట్లు పెంచుదామన్నారు. త్వరలో వరంగల్ కార్పొరేషన్ గెలుచుకుంటామని, ప్రజలు బీజేపీ రావాలని కోరుకుంటున్నారన్నారు. కేంద్రం నుంచి వరంగల్‌కు వస్తున్న స్మార్ట్ సిటీ నిధులను అప్పటి మంత్రి కేటీఆర్ దారి మళ్లిస్తే తాను కొట్లాడితే వరంగల్‌కు నిధులు ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ గడీలను బద్దలు కొట్టింది బీజేపీ అన్నారు. 38 మంది ఎమ్మెల్యేలు ఉండి బీఆర్ఎస్ ఎందుకు రాజ్యసభ సీటుకు పోటీ చేయలేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి పని చేస్తున్నాయని, త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయమన్నారు. ఉన్న భూములన్నీ కేసీఆర్ అమ్మేసినంకా ఇక సీఎం రేవంత్ రెడ్డి వేల ఎకరాల్లో జూ పార్క్, ఫోర్త్ సిటీ, హెల్త్ హబ్ నిర్మాణం ఎట్లా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే కేసీఆర్ కటుంబాన్ని జైలులో వేసేవాళ్లమని, బీఆర్ఎస్ రాక్షస పార్టీ అని దానితో విలీనం కాదు కదా పొత్తు కూడా ఉండదన్నారు. కబ్జాకోరులను వదలవద్దని, హైడ్రా పేదల జోలికి వెళ్లొదన్నారు. ఆరు హామీలను ప్రజలు మర్చిపోవడానికే హైడ్రాను తీసుకొచ్చారని, రైతు రుణ మాఫీ అందరికీ జరిగిందా అని ప్రశ్నించారు. పాతబస్తీలో గెలిచి ప్రజలకు అభివృద్ధి ఫలాలు చూపించి ఎంఐఎం అనవాళ్లు లేకుండా చేస్తామన్నారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అ ధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, రాష్ట్ర ప్రధా న కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మార్తినేని ధర్మారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వమే గద్దర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

- గద్దర్ కుమారుడు సూర్యకిరణ్

నయీంనగర్: ప్రతి జిల్లాలో గద్దర్ విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని గద్దర్ కుమారుడు గుమ్మడి సూర్యకిరణ్ అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గద్దరన్న విగ్రహ కమిటీ చైర్మన్ కొంద్రు నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన గద్దర్ ప్రథమ వర్ధంతిలో సూర్యకిరణ్ పాల్గొని మాట్లాడారు. ప్రజలే గద్దర్ వారసులని, అణగారిన ప్రజల హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ పుట్టుక, చావు తనది బతుకంతా ప్రజల పక్షాన నిలబడి కలబడి పోరాటం చేసిన గద్దర్ చరిత్రను సవివరంగా ప్రజలకు అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు సంగం రెడ్డి పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రజల కష్టాలు అర్థం చేసుకున్న గొప్ప నాయకుడు గద్దర్ అని, పేదలకు అండగా ఉన్న ఆయన లేకపోవడం ప్రజాఉద్యమాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో గద్దర్ కోడలు సరిత, నాయకులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, సాయిని నరేందర్, సీఎల్ యాదగిరి, పటేల్ వనజక్క, సుంకరి భిక్షపతి, సోమ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుల సెంటర్‌లపై టీజీఎంసీ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న టీజీఎంసీ వైద్యుల బృందం


స్వాధీనం చేసుకున్న స్టెరాయిడ్, పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్ మందులు

- అధిక సంఖ్యలో స్టెరాయిడ్ ఇంజక్షన్ల స్వాధీనం

కాశిబుగ్గ : ఎలాంటి అనుమతులు లేకుండా స్థాయికి మించి వైద్యం చేస్తున్న నకిలీ వైద్యుల సెంటర్లపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్(టీజీఎంసీ) బాధ్యులు శనివారం తనిఖీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో స్టెరాయిడ్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ వైద్యులపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా టీజీఎంసీ బృందం కాశిబుగ్గ, తిలక్ రోడ్డుల లో సుహాన ఫస్ట్ ఎయిడ్ సెంటర్, హిజమా మెడికల్ సెంటర్, రామ్మోహన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లలో తనిఖీలు చేపట్టారు. వీరు ఎలాంటి అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్నారని గుర్తించారు. సుహాన ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహించే గుర్రం సదానందం గతంలో ఓ హాస్పిటల్‌లో ఐసీయూ అటెండర్‌గా పనిచేసేవాడని, ఇప్పుడు వైద్యుడిగా చెలామణి అవుతూ పెద్ద చికిత్సలు చేస్తున్నట్లు టీజీఎంసీ బృందం సభ్యులు తెలిపారు. అతడి వద్ద ఆధిక సంఖ్యలో స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్స్ గుర్తించామన్నారు. ఇతను పిన్నావారి స్ట్రీట్‌లోని మెడికల్ ఏజెన్సీలనుంచి ఎటువంటి అనుమతి లేకుండా వేరే షాపు లైసెన్స్ ద్వారా మందులు తెచ్చుకున్నట్లు చెప్పారు. తిలక్‌రోడ్డు నకిలీ వైద్యుడు రామ్మోహన్ ఎక్స్‌రే టెక్నీషియన్ చదివి డాక్టర్‌గా చెలామణి అవుతున్నాడని, మరో నకిలీ వైద్యుడు షేక్ నయూమ్‌లపై ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రజలు నకిలీ వైద్యుల వద్దకి వెళ్లి చికిత్స చేయించుకోవద్దని వారు కోరారు. తనిఖీల్లో డా.నరేశ్‌కుమార్, డా.వెంకటస్వామి, డా.ప్రసన్న ఉన్నారు.